

ప్లాంటేషన్‌ల్లో మొక్కల ఎదుగుదలకు కృషి

సబ్ డిఎఫ్ఒ వెంకట సుబ్బయ్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీ శాఖ పరిధిలో నాటిన ప్లాంటేషన్‌లలో మొక్కల ఎదుగుదలకు కృషి చేస్తున్నట్లు సబ్ డిఎఫ్ఒ వెంకట సుబ్బయ్య తెలిపారు. మండలంలోని కామయ్యపాలెం బీట్, జీలుగుమిల్లి బీట్‌లలో గత రెండు సంవత్సరాల క్రితం నాటిన మారుజాతి మొక్కల ప్లాంటేషన్‌లను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్‌లలో మొక్కల పెరుగుదలకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొక్కల మధ్యలో కలుపు మొక్కలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీశాఖ పరిధిలో ఉన్న ప్లాంటేషన్‌లలో మొక్కల ఎదుగుదలకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గాకుమార్, డిఆర్ఒ ధర్మారావు, బీట్ అధికారులు మారేష్, ఏసు పండు, అటవీ శాఖ సిబ్బంది రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ'ల్లో మ్యాపింగ్ మాయ..!

500కుపైగా ఆస్తులకు ఒకటే ఫోన్ నెంబర్ మ్యాపింగ్

కార్యదర్శుల నిర్లక్ష్య వైఖరిపై ఉన్నతాధికారులు సీరియస్

ఏలూరు, పశ్చిమగోదారి జిల్లాలో ఇద్దరు కార్యదర్శులు సస్పెండ్

కుక్కునూరు మండలం అమరవరం, నరసాపురం మండలంలో వేములదీవి వెస్ట్ కార్యదర్శులపై వేటు

మరికొంతమందికి షోకాజ్ నోటీసులు జారీ

పంచాయతీ వ్యవస్థ గాడిన పడేనా అంటూ జనాల్లో చర్చ

ఆడిట్‌లో నిర్లక్ష్యం, ఆర్థిక సంఘం నిధుల ఖర్చుల్లోనూ అవకతవకలే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంచాయతీల పరిధిలోని ఆస్తులకు ఫోన్ నెంబర్ మ్యాపింగ్‌లో కార్యదర్శుల నిర్లక్ష్య వైఖరి అత్యంత ఘోరంగా తయారైంది. కార్యాలయాల్లో కూర్చుని ఇష్టమొచ్చిన ఫోన్ నెంబర్లను ప్రజల ఆస్తులకు మ్యాపింగ్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీని వెనుక పెద్దఎత్తున అవినీతి పర్వం నడుస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో పంచాయతీ పరిధిలోని ఆస్తులకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారు. ఆస్తులకు సంబంధిత యాజమానుల ఫోన్ నెంబర్లు మ్యాపింగ్ చేస్తారు. గ్రామస్తులు పన్నులు చెల్లించిన వెంటనే సంబంధిత యజమాని ఫోన్‌కు మెసేజ్ వెళ్తుంది. ఒకవేళ పన్ను చెల్లించకపోయినా హెచ్చరిక మెసేజీ వెళ్లే విధంగా ఈ విధానం తెచ్చారు. అత్యంత కీలకమైన ఫోన్ నెంబర్ల మ్యాపింగ్‌లో పంచాయతీ కార్యదర్శులు వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలోని 500కుపైగా ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేసిన పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో కుక్కునూరు మండలంలోని అమరవరం, పెదవేగి మండలంలోని కూచింపూడి, ముసునూరు మండలంలోని ముసునూరు, టి.నరసాపురం మండలంలోని టి.నరసాపురం, చింతలపూడి మండలంలోని ప్రగడవరం పంచాయతీల్లో 500కుపైగా ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేసినట్లు తేలింది. చాలా పంచాయతీల్లో వందల సంఖ్యలో ఆస్తులకు ఒకే నెంబర్ మ్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. దీంతో గ్రామంలోని 50 శాతం ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేయడాన్ని తీవ్రంగా పరిగణించి కుక్కునూరు మండలం అమరవరం పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. మిగిలిన నాలుగు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం మండలంలోని వేములదీవి వెస్ట్, పెదమైనవానిలంక, తూర్పుతాళ్లు, కాళ్ల మండలం పెదఅమిరం పంచాయతీల్లో వందల ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేసినట్లు తేల్చారు. దీంతో వేములదీవి వెస్ట్ పంచాయతీ కార్యదర్శిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. రాష్ట్రస్థాయి పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాకు ఒక పంచాయతీ కార్యదర్శిని మాత్రమే ప్రస్తుతానికి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన వారికి షోకాజ్ నోటీసులు, హెచ్చరికలు చేసిన పరిస్థితి ఉంది. అత్యధిక పంచాయతీల్లో మ్యాపింగ్‌లో భారీ అవకతవకలు జరిగినట్లు చెబుతున్నారు. ప్రజల నుంచి వచ్చే పన్ను సొమ్మును స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా చెల్లింపులు చేయాలి. అలాకాకుండా కొంతమంది కార్యదర్శులు సొమ్ము తీసుకుని, సొంత ఖర్చులకు వాడుకుని తర్వాత తాపీగా ఆ సొమ్ము చెల్లించడం, లేదా దుర్వినియోగం చేయడం జరుగుతుందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే యజమానులకు మెసేజీలు వెళ్లకుండా ఉండేందుకు తప్పుడు ఫోన్ నెంబర్లు మ్యాపింగ్ చేసినట్లు చర్చ సాగుతోంది. ఇప్పటికైనా అవినీతికి అడ్డుకట్ట వేస్తారో, లేదో చూడాలి.



ఆడిట్, ఆర్థిక సంఘ నిధుల ఖర్చుల్లోనూ అవకతవకలే

పంచాయతీ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రజాప్రతిధులతో కుమ్మక్కై పంచాయతీ సొమ్మును ఇష్టానుసారంగా దుర్వినియోగం చేస్తున్నట్లు అనేక ఫిర్యాదులు సైతం ఉన్నతాధికారులకు అందుతున్నాయి. పలు పంచాయతీల అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్న పరిస్థితి సైతం ఇటీవల ఉంది. ప్రతియేటా పంచాయతీలకు సంబంధించి, నిధులు, ఖర్చులపై అడిట్ చేయించాల్సి ఉంటుంది. చాలామంది కార్యదర్శులు సకాలంలో ఆడిట్ చేయించని పరిస్థితి కన్పిస్తోంది. ఏలూరు జిల్లాలో పలు పంచాయతీలకు సంబంధించిన ఆడిట్‌లో లక్షల సంఖ్యలో అభ్యంతరాలు వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు రూ.200 కోట్ల సొమ్ముపై అభ్యంతరాలను ఆడిట్ అధికారులు లేవనెత్తినట్లు సమాచారం. ఆర్థిక సంఘం నిధులు, సంబంధిత ఖర్చులకు సంబంధించి ఇ-గ్రామస్వరాజ్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇ-గ్రామస్వరాజ్‌లో ఇష్టానుసారం వెండర్ అకౌంట్లు తెరిచి సొమ్ము మళ్లిస్తున్న పరిస్థితి ఎక్కువగా ఉంది. తమ బంధువుల, కుటుంబసభ్యుల పేర్లతో వెండర్ అకౌంట్లు ఓపెన్ చేసి సొమ్ము మళ్లిస్తున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పంచాయతీల్లో అవినీతిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప బయటకు రావడం లేదు. ఎంపిడిఒలు, డిఎల్‌పిఒలు పంచాయతీ కార్యదర్శులకు కొమ్ముకాయడం కారణంగానే అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ వ్యవస్థ గాడిన పడేనా అనే చర్చ జనాల్లో సాగుతోంది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించను

3 నెలలుగా మరుగుదొడ్ల నిర్మాణంలో పురోగతి లేదు

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పని తీరుపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు

విధుల పట్ల నిర్లక్ష్యం, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయని అధికారులను ఉపేక్షించేది లేదని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను హెచ్చరించారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో, అంగన్వాడీ కేంద్రాలు, పర్యాటక శాఖకు చెందిన ప్రదేశాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులపై ఆర్‌డబ్ల్యూఎస్, సంక్షేమ శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. జిల్లాలోని హాస్టళ్లకు మరుగుదొడ్లు మంజూరు చేసి మూడు నెలలు దాటినా ఇంకా నిర్మించకపోవడంపై కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్మాణంలో రెండు నెలల నుండి ఎటువంటి పురోగతీ కనిపించని కామవరపుకోట, జీలుగుమిల్లి, కైకలూరు, ముదినేపల్లి, పోలవరం, కలిదిండి మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, 24 గంటల్లో పనుల్లో పురోగతి ప్రదర్శించని సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు మంజూరు చేసిన మరుగుదొడ్లు, తాగునీటి పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు తమ శాఖకు చెందిన హాస్టళ్లకు మంజూరైన పనులు పూర్తయ్యేలా సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించాలన్నారు. పనులు పూర్తి నాణ్యతతో ఉండేలా పర్యవేక్షించాలన్నారు. వసతి గృహాల ఆవరణలో సంపూర్ణ పారిశుధ్యం ఉండాలని, దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు దోమతెరలు అందించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. హాస్టళ్ల ఆవరణలో ఫాగింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో సిపిఒ వాసుదేవరావు, సంక్షేమ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

దేశభక్తిని మేల్కొలిపే వందేమాతరం

జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ

ప్రజాశక్తి - ఏలూరు

వందేమాతరం నినాదం మనందరిలో దేశభక్తిని మేల్కొలిపే ఒక శక్తి అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ అన్నారు. వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో శుక్రవారం అధికారులు, సిబ్బంది, ప్రజలందరూ ఏకస్వరంతో వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా జెసి అభిషేక్ గౌడ మాట్లాడుతూ వందేమాతరం గీతం స్వాతంత్ర స్ఫూర్తికి మూలం అన్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గీతం స్వాతంత్ర సమరయోధులకు స్ఫూర్తినిచ్చి, కోట్లాది భారతీయుల్లో దేశభక్తిని వెలిగించిందన్నారు. వందేమాతరం గీతం మన భారతీయులకు ఎప్పుడూ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి విలియమ్స్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, కలెక్టరేట్ ఆవరణలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి అభిషేక్ గౌడ

సోషలిజమే అన్ని సమస్యలకు పరిష్కారం

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సోషలిజమే అన్ని సమస్యల పరిష్కారానికి అంతిమ మార్గమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్ అన్నారు. అక్టోబరు విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో 'ప్రపంచ పరిణామాలు-సోషలిజమే అంతిమ మార్గం' అనే అంశంపై జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. తొలుత సిపిఎం జిల్లా పూర్వ కార్యదర్శి చింతకాయల బాబూరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సదస్సులో అశోక్ మాట్లాడుతూ 1917 అక్టోబరు విప్లవం ప్రపంచ చరిత్రలో నవశకానికి ఆరంభం అన్నారు. అక్టోబరు విప్లవం కేవలం జార్ చక్రవర్తుల నియంతృత్వానికి వ్యతిరేకంగానే సాగింది కాదన్నారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ విధానాలపై వ్యతిరేకంగా సామ్యవాద విప్లవం జరిగిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ అక్టోబరు విప్లవాన్ని విజయపథాన నడిపించిన వ్యూహం కార్మిక, కర్షక ఐక్య సంఘటన వలస దేశాలు, అర్ధ వలస దేశాల విముక్తి పోరాటాల్లో కీలకమైన వ్యూహంగా మారిందని గుర్తు చేశారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో కూరుకుపోయిందని, పలు దేశాల్లో సోషలిస్ట్ భావాలు కల్గిన వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటున్నారని అన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం పేదలు లేని రాష్ట్రంగా దేశంలో నిలిచిందన్నారు. ఇది కేవలం కమ్యూనిస్టుల వల్లే సాధ్యమని అన్నారు. దేశంలో దోపిడీ, ఆర్థిక అసమానతలు లేని సమసమాజం కోసం సోషలిజమే అంతిమ మార్గమని అన్నారు. సోషలిజం స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్రం నుండి నెహ్రూ బొమ్మ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి, నేతలు కారం భాస్కర్, సిరిబత్తుల సీతారామయ్య, పోలోజు నాగేశ్వరరావు, చంద్రు బుల్లెమ్మ, తెల్లం సంకురుడు, తామా బాలరాజు, బొరగం భూచంద్రరావు, గుండి గంగరాజు, కారం ముత్యాలరావు, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

రానున్న కాలంలో సమరశీల ఉద్యమాలు, పోరాటాలు

వ్యకాస జిల్లా మహాసభ పిలుపు

నూతన అధ్యక్ష కార్యదర్శులుగా తామా ముత్యాలమ్మ, పి.రామకృష్ణ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భూమి, ఉపాధి హామీ, ఇళ్ల స్థలాలు, పామాయిల్ కార్మికులు, నర్సరీ కార్మికులు, ఆక్వా కార్మికుల సమస్యలపై రానున్న కాలంలో సమరశీల ఉద్యమాలు పోరాటాలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ తీర్మానించిందని ఆ సంఘం నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తామా ముత్యాలమ్మ, పి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక అన్నే భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. సంఘం 32వ జిల్లా మహాసభ ఈ నెల 5, 6 తేదీల్లో టి.నర్సాపురంలో ఆర్ఎస్ నగర్ (ఎస్ఎస్ కళ్యాణ మండపం)లో నిర్వహించామన్నారు. మహాసభలో పలు అంశాలపై చర్చించి 10 తీర్మానాలను ఆమోదించినట్లు వివరించారు. 79 ఏళ్ల స్వాతంత్ర కాలంలో పాలకులు భూపంపకం గురించి ఆలోచించలేదని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ, పేదల భూములను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. పేదలకు అనుకూలంగా ఉన్న చట్టాలను గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు అనుకూలంగా మార్చుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వతంగా పేదరిక నిర్మూలన జరగాలంటే పేదలకు భూపంపిణీ చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, పట్టణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టాలని కోరారు. అడిగిన ప్రతి వ్యక్తికీ పని కల్పించాలని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఉపాధి హామీలో అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు 200 రోజులకు పెంచి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. నిత్యావసరాల ధరలు నియంత్రించాలని, ప్రజాపంపిణీ ద్వారా 14 రకాల సరుకులు అందించాలని కోరారు. గతంలో వలె ప్రతి మనిషికీ నెలకు 10 కిలోల బియ్యం ఇవ్వాలని, గతంలో ఇచ్చిన విధంగా పామాయిల్, కందిపప్పు, పంచదార అందరికీ ఇవ్వాలనీ కోరారు. గిరిజన ప్రాంతాలు, దళితులు, బలహీనవర్గాలు, దళితులపై దాడులు అరికట్టాలని, వివక్ష రూపుమాపడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు, హత్యలను నివారించాలని, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులు, రాజ్యాంగం కల్పించిన హక్కులు పటిష్టంగా అమలు చేయాలని, సామాజిక న్యాయాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 31 మంది నూతన కార్యవర్గాన్ని ప్రతినిధులు ఎన్నుకున్నారని తెలిపారు. నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా తామా ముత్యాలమ్మ, పి.రామకృష్ణ ఎన్నికయ్యారని, సీనియర్ నేత ఎస్.కోటేశ్వరరావును జిల్లా కమిటీ శాశ్వత ఆహ్వానితుడిగా ఎన్నికయ్యారని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎ.రవి, ఎం.జీవరత్నం, వై.నాగేంద్రరావు, జి.వెంకట్రావు, సహాయ కార్యదర్శులుగా ఎస్.మహంకాళిరావు, జి.సత్యనారాయణ, యు.వెంకటేష్, కె.నాగదుర్గ, టి.సత్యనారాయణ ఎన్నికయ్యారని తెలిపారు.



ముత్యాలమ్మ



రామకృష్ణ

కార్మికులను మోసగించిన కూటమి ప్రభుత్వం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఎపి బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రమణారావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 18 నెలలు గడిచినా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించకుండా భవన నిర్మాణ కార్మికులను మోసం చేసిందని ఎపి బిల్డింగ్, ఆధర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు యర్ర రాంబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారపల్లి రమణారావు మాట్లాడుతూ కూటమి నాయకులు అధికారంలోకొస్తే వంద రోజుల్లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన 1214 మెమో రద్దు చేసి వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న క్లైములు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 20వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలెక్టరేట్‌ల వద్ద నిరసన తెలియజేస్తామని తెలిపారు. ఈ నిరసనలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ పది గంటల పని విధానం తీసుకురావడం కార్మిక హక్కులను హరించడమేనన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటల పెంపుపై ఇచ్చిన మెమో రద్దు చేయాలని కోరారు. విశాఖలో జరుగుతున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చిట్టుకొమ్ము కొండలరావు, ఆదికృష్ణ, రెడ్డి లక్ష్మణరావు, అబ్దుల్లా అక్బర్, వడ్లమూడి నాగరాజు పాల్గొన్నారు.

నూజివీడు బాలోత్సవం-2 జయప్రదానికి పిలుపు

వాల్‌పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో నూజివీడు బాలోత్సవం పిల్లల పండుగ-2 వేడుకలపై పోస్టర్లు, కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూజివీడు బాలోత్సవం పిల్లల పండుగ-2 ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ వి.రాఘవరావు, ప్రధాన కార్యదర్శి బిఎల్‌బి.కోటేశ్వరి, సమన్వయకర్త ఎన్ఆర్ హనుమాన్లు, ఎంఇఒ సుబ్బారావు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన నూజివీడు బాలోత్సవం పిల్లల పండుగ మొదటి వేడుకను మించి ఈ రెండో వేడుక అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సకల సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. సెయింట్ థామస్ హైస్కూల్ ఆవరణలో డిసెంబర్ 21వ తేదీ ఆదివారం నూజివీడు బాలోత్సవం పిల్లల పండుగ-2 ఉత్సవాన్ని నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. సమాజంలో నిత్యం అనేక అంశాల్లో పోటీపడుతూ ఒత్తిడికి గురికాకుండా ఉండే రీతిగా నూజివీడు బాలోత్సవాన్ని చిన్నారి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ బాలోత్సవ కార్యక్రమంలో అనేక సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా చిన్నారుల్లో ఉత్సాహం మరింతగా రెట్టింపు అవుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో చిన్నారి విద్యార్థుల్లో కొత్త ఉత్తేజం, ఉత్సాహం నిండి చదువు పట్ల మరింత ఆసక్తి పెంపొందడం ద్వారా అటు చదువులోనూ, క్రీడాంశాల్లోనూ, ఇతర సామాజిక అంశాల పట్ల లోతైన పరిశీలన, పరిశోధనా చేసే సత్తా విద్యార్థుల్లో నెలకొంటుందన్నారు. విద్యార్థి దశ ముగిసి జీవితాల్లోకి అడుగుపెట్టే సమయాల్లో నేటి విద్యార్థులు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే రీతిగా సంసిద్ధం కాగలరని ఆకాంక్షించారు. అందుకోసం అన్ని తరగతుల ప్రజలు, సామాజికవేత్తలు, పలు ప్రజాసంఘాల నాయకులు సహకరించి, సలహాలు సూచనలు అందించడం ద్వారా ప్రోత్సహించి నూజివీడు బాలోత్సవం పిల్లల పండుగ-2ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, గౌరవ ఉపాధ్యక్షులుగా సిహెచ్‌ఎల్.రమేష్‌బాబు, బ్రదర్ కిషోర్ కుమార్‌లు, అధ్యక్షులుగా డాక్టర్ వి.రాఘవరావు, ప్రధాన కార్యదర్శిగా బిఎల్‌బి.కోటేశ్వరి, ట్రెజరర్‌గా కెవి.శేషయ్య, ఉపాధ్యక్షులుగా పి.ఉదయలక్ష్మి, డి.మోహనరావు, శిఖా ఆకాష్, ఎస్‌కె.సుభాని, ఎం.బాలు, కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.గంగేయుడు, కార్యదర్శులుగా ఎకెడి.ప్రసాద్, ఎస్‌కె.సలీంబాబు, పి.శివన్నారాయణ, కృష్ణవేణి, జె.మధులతో ఏర్పడింది. ఉపాధ్యాయులు డి.బెనర్జీ, జె.మధు, బత్తుల అనురాధ, మార్ష తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్

ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి : 15వ అదనపు జిల్లా జడ్జి

నూజివీడు టౌన్ :వచ్చే నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శుక్రవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ బార్ అసోసియేషన్ మెంబర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగశైలజ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేటట్లు చూడాలని కోరారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.రమేష్, సెక్రటరీ హరిబాబు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తుపాన్‌కు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి

సంబంధిత అధికారులకు జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మొంథా తుపాన్ నేపథ్యంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా, ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని జెడ్‌పి ఛైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. ఇటీవల జిల్లాలో మొంథా తుపాన్ కారణంగా దెబ్బతిన్న రహదారులపై జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ ఇటీవల సంభవించిన మొంథా తుపాన్ వల్ల జిల్లాలోని అనేక గ్రామీణ రహదారులు తీవ్రంగా దెబ్బతిని ప్రజలు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రతి మండలస్థాయిలో రోడ్ల నష్టం వివరాలను సేకరించి, అత్యవసర మార్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె ఆదేశించారు. ఆసుపత్రులు, పాఠశాలలు, మార్కెట్ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారుల పునరుద్ధరణను ప్రాథమికంగా చేపట్టాలని సూచించారు. తాత్కాలికంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో గుంతలు పూడ్చడం, డ్రెయినేజ్ శుభ్రపరచడం, నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. నష్టానికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి మైనర్ రిపైర్లకు జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జిల్లా ప్రజల కోసం రోడ్ల పునరుద్ధరణకు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ ఎం.శ్రీహరి, డిప్యూటీ సిఇఒ కె.భీమేశ్వర్, పంచాయతీ రాజ్ ఎస్ఇ, ఇఇ, అన్ని మండలాల ఎఇలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్

రైతు రక్షణ కోసం రైతుసంఘం పోరాటాలు

నేడు జంగారెడ్డిగూడెంలో సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రైతురక్షణ కోసం రైతుసంఘం అనేక పోరాటాలు సాగిస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. ఈ నెల 8న జంగారెడ్డిగూడెంలోని రోటరీ క్లబ్ హాలులో నిర్వహిస్తున్న సంఘం జిల్లా మహాసభ నిర్వహణ కోసం పట్టణంలో జెండాలు, తోరణాలతో అలంకరించారు. తొలుత స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మహాసభ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు రక్షణ, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం ఎపి రైతుసంఘం కృషి చేస్తుందని చెప్పారు. నేడు రైతుల తమ హక్కుల కోసం కాకుండా రైతు మనుగడ కోసం పోరాటాలు చేయాల్సి వస్తుందన్నారు. గడిచిన మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో సంఘం అనేక రైతాంగ సమస్యలపై ఉద్యమాలు చేసిందని, ఫలితంగా అనేక రైతాంగ సమస్యలు పరిష్కారమయ్యాయని గుర్తు చేశారు. కోకో, కొబ్బరి, ధాన్యం, మొక్కజొన్న, ఆయిల్‌పామ్, మిర్చి, నిమ్మ, పాడి, ఆక్వా, కూరగాయలు తదితర పంటల రైతుల సమస్యలపైన, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులు, సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై అనేక ఆందోళనలు, పోరాటాలు రైతుసంఘం ఆధ్వర్యంలో సాగాయని చెప్పారు. సంఘం మహాసభలో రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించడం జరుగుతుందన్నారు. భవిష్యత్ కార్యాచరణ ఈ మహాసభలో రూపొందిస్తామని చెప్పారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు మాంద్రు సూర్యచంద్రం, సిఐటియు నాయకులు పి.సూర్యారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అందుగుల ప్రభాకరరావు, గట్టియ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పోలవరం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందని ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. పోలవరంలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పలువురు మండల ప్రజలు సమస్యలపై ఆయనకు అర్జీలు అందించారు. శ్రీనివాసులు కొన్ని సమస్యలపై అధికారులతో మాట్లాడి అక్కడే పరిష్కరించారు. ఇతర సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు జనసేన డైరెక్టర్ మడకం కన్నరాజు, సునకాని రాంబాబు, సీనియర్ నాయకులు కుంచే దొరబాబు, పాపోలు రత్నయ్య, జల్లేపల్లి పెద్ద అబ్బులు, పొట్టా రామారావు, కరిబండి నాగరాజు, కొణతాల ప్రసాద్, వలవల శ్రీనివాస్, పూడి వెంకట్రావు, దోకుల నాగేశ్వరరావు, కోడి శ్రీనివాస్, పాదం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - మండవల్లి

ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థుల జీవితం నాశనం అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి వివిఎన్‌వి.లక్ష్మి అన్నారు. మండలంలోని లోకుమూడి వికాస్ జూనియర్ కాలేజీలో లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా చట్టాలపై అవగాహన పెంచుకుని జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్లు శివప్రసాద్, పవన్ కాంత్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

హీల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెలక్షన్స్‌లో మండల పరిధిలోని తోటపల్లి హీల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు వివిధ పోటీల్లో కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికైనట్లు హీల్ స్కూల్ ప్రిన్సిపల్ వై.జాలాదేవి తెలిపారు. అండర్-19 విభాగంలో అథ్లెటిక్స్‌లో కె.లక్ష్మీధర్, బి.పవన్, వి.కిషోర్, వాలీబాల్ అండర్-17 విభాగంలో వి.అశ్విన్ ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కృష్ణాజిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, సిఇఒ కురువాటి అజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ మిక్కిలినేని హరీష్, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, కోచ్‌లు శ్రీనివాసరెడ్డి, జెట్టి అభినందించారు.

సుబ్బరాజు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు


సుబ్బరాజు (ఫైల్)

కోసూరి సుబ్బరాజు మృతి పార్టీకి తీరని లోటని టిడిపి జిల్లా మాజీ రైతు సంఘం అధ్యక్షులు చిట్నేని శివరామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని సూరవరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, రైతు సంఘం మాజీ, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు కోసూరి సుబ్బరాజు(59) గురువారం ఉదయం సూరవరం గ్రామంలోని ఆయన స్వగృహం వద్ద అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని టిడిపి మండలాధ్యక్షులు ఎన్.వేణు, ప్రధాన కార్యదర్శి కె.సాంబశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మంగయ్య, జి.సాంబశివరావు, జోషిబాబు, దావీదు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఎం.గంగారాం, హరిబాబు, మాజీ సర్పంచ్ కె.సుబ్బరాజు, వి.కిశోర్‌లు సందర్శించి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పిల్లలకు సకాలంలో టీకాలు అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చిన్నపిల్లల వైద్యులు జెబి వుల్ల కోరారు. అంతర్జాతీయ శిశు సంరక్షణ దినోత్సవాన్ని చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, గుమిశెట్టి భారతి, వాలంటరీ సేవకులు తెలిసి టెట్టిబీదర్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్టు విజయలక్ష్మి, డాక్టర్ హర్షిత మాట్లాడుతూ బాలింతలు పిల్లలకు పాలిచ్చే విధానం, పరిసరాల నుంచి ప్రతి తల్లి పిల్లలను ఎలా సంరక్షించుకోవాలో వివరించారు. అనంతరం స్వచ్ఛంద సేవకులు తెలిసా ఇసుకతో తయారుచేసిన కేరింగ్ మదర్ కేరింగ్ చైల్డ్ చిత్రపటం అందరిని ఆకర్షించింది.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాల్లో భాగంగా నూతిరామన్నపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ, అర్చరీ ఆటల పోటీలను ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎటిడబ్ల్యు ఒ జనార్ధన్, ఉప విద్యాశాఖాధికారి కుమార్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి శిరమయ్య, రెండు ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆటో డ్రైవర్ దారుణ హత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో శుక్రవారం రాత్రి ఆటో డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ పరిధిలోని గణేష్ నగర్ ప్రాంతానికి చెందిన నమ్మి హరికృష్ణ (32) స్థానికంగా ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య షాపింగ్ మాల్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన దీపక్ వ్యక్తి ఈ కుటుంబంతో సాన్నిహితంగా ఉంటున్నాడు. ఇతను ఆర్ఆర్.పేటలోని ఓ టీ దుకాణంలో టీమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటి వద్ద కత్తితో దీపక్ హరికృష్ణపై పలుమార్లు దాడి చేశాడు. తీవ్ర గాయాల పాలైన హరికృష్ణను స్థానికులు ఏలూరు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే హరికృష్ణ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఏలూరు వన్‌టౌన్ సిఐ సత్యనారాయణ, ఏలూరు రూరల్ ఎస్ఐ నాగ బాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. హత్యకు గల కారణాలు పూర్తిస్థాయిలో ఇంకా తెలియ రాలేదు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్ చోరుల ముఠా అరెస్టు

21 ద్విచక్రవాహనాలు స్వాధీనం

ఏలూరు స్పోర్ట్స్ :ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో వరుస ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 21 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని దెందులూరు, నూజివీడు, ఆగిరిపల్లి, తిరువూరు, విస్సన్నపేట, ఏలూరు, తెలంగాణ రాష్ట్రంలో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఫిర్యాదులు అందాయి. ఈ దొంగతనం కేసులు ఛేదించేందుకు నూజివీడు పట్టణ సిఐ సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నూజివీడు రామన్నగూడెం డంపింగ్ యార్డ్ వద్ద ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారిని ప్రశ్నించగా దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నేరాలకు పాల్పడుతున్న నూజివీడు పట్టణానికి చెందిన దళాయి గణేష్, నూజివీడుకు చెందిన షేక్ మెహర్ బాబా, గొల్లపల్లి గ్రామానికి చెందిన చౌటుపల్లి సుభాష్, ఎంఆర్.అప్పారావు కాలనీకి చెందిన షేక్ అసిఫుల, చిత్తూరు అజయ్‌కుమార్‌లను అరెస్టు చేశారు.

గోదావరిలో స్నానానికి దిగి వ్యక్తి గల్లంతు

కుక్కునూరు రూరల్ : మండలంలోని దాచారం గోదావరిరేవులో ఓ వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం స్నానానికి దిగి గల్లంతయ్యారు. వివరాల ప్రకారం బెస్తగూడెం గ్రామానికి చెందిన కుమ్మరపల్లి నాగార్జున (25)తోటి అయ్యప్ప స్వామి మాలాధారులతో కలిసి నదిలో స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తు నాగార్జున గోదావరి నదిలో మునిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీయడమే లక్ష్యం

ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి



ప్రజాశక్తి - పోలవరం

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీయడమే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో కాసేపు ముచ్చటించారు.

ప్రశ్న : పోలవరం నియోజకవర్గం వంటి ఏజెన్సీ ప్రాంతంలో క్రీడా సదుపాయాల స్థితి ఎలా ఉంది?

జగదీశ్వరి : ఏజెన్సీ ప్రాంతంలో క్రీడాకారులు చాలామంది ఉన్నారు. వారు ఒక స్కూల్ కాలేజీ వరకే పరిమితమయ్యారు. అందుకు కెవికెను నియోజకవర్గంలో ఏర్పాటు చేసే క్రీడాకారులకు మంచి సదుపాయంతో పాటు ఆటల పట్ల మెలుకువలు నేర్చుకోవడం జరుగుతుంది. తద్వారా వారు వాళ్ల గేమ్‌ను డెవలప్ చేసుకుంటారు.

ప్రశ్న : గిరిజన యువత క్రీడల వైపు మక్కువ చూపుతున్నారు. వారికి ఏ సహాయం అందిస్తున్నారు?

జగదీశ్వరి : ముఖ్యంగా ఏజెన్సీ వారు వాలీబాల్, కబడ్డీ, అర్చరి గేమ్స్ వంటిపై ఎక్కువగా మక్కువ చూపుతారు. వారు ఏ క్రీడలో రాణిస్తారో దానిలో కౌన్సెలింగ్ ఇస్తాం. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ క్రీడలను ప్రోత్సహిస్తుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతి స్కూల్‌కు ఆటస్థలం తప్పనిసరని చెప్పారు.

ప్రశ్న : మహిళా క్రీడాకారిణులకు ప్రత్యేక ప్రోత్సాహం ఉందా?

జగదీశ్వరి : మహిళా క్రీడాకారిణులు ఎందులోనూ తక్కువ కాదని ఈ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో మనం చూశాం. ఎక్కువ మహిళ క్రీడాకారులు చాలా పతకాలు సాధించడం మనం చూస్తున్నాం. ఆర్చరీ, అత్లెక్, చెస్ వంటి గేమ్‌లలో మహిళలు ముందున్నారు.

చిట్ చాట్

ప్రశ్న : నియోజకవర్గం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి వెళ్లిన క్రీడాకారులు ఉన్నారా?

జగదీశ్వరి : వాటర్ స్పోర్ట్స్ జంగారెడ్డిగూడెం నుంచి నేషనల్‌కు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా ఈ ఏడాది డిఎస్‌సిలో 480 పిఇటి, పీడీ పోస్టులకు విత్‌ఔట్ ఎగ్జామ్, కేవలం సర్టిఫికెట్ మెరిట్స్ ద్వారా వారికి ఉద్యోగం కల్పించాం. నేషనల్, ఒలంపిక్ ప్లేయర్స్‌కు గ్రూప్ వన్, గ్రూప్ టూ పోస్టులకు కూడా విత్‌ఔట్ ఎగ్జామ్ ద్వారా ఈ ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వనుంది.

ప్రశ్న : మండలంలో గాని నియోజకవర్గంలో గాని ఇండోర్ స్టేడియంలు ఏర్పాటు చేస్తారా?

జగదీశ్వరి : కెవికె పనులు పున:ప్రారంభం అవుతున్నాయి. అలాగే ఈ మధ్య శాప్ ఛైర్మన్ రవినాయుడు పోలవరం వచ్చినప్పుడు నియోజకవర్గంలో ఒక మినీ ఇండోర్ స్టేడియానికి అనుమతులు ఉన్నాయని చెప్పారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న పురం శ్రీనివాస్

విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి కలిగి ఉండాలి

జెవివి జిల్లా ప్రచార కార్యదర్శి పురం శ్రీనివాస్

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు చిన్నతనం నుంచే విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి కలిగి ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రచార కార్యదర్శి పురం శ్రీనివాస్ అన్నారు. స్థానిక విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో శుక్రవారం ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్తలు సర్ సివి.రామన్, మేడమ్ మేరీ క్యూరీ జయంతి వేడుకలు పాఠశాల కరస్పాండెంట్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా శాస్త్రవేత్తల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే వస్తువులను, విషయాలను కనుగొనేందుకు తమ జీవితాలను ధారపోసిన అద్భుత శాస్త్రవేత్తలు సివి.రామన్, మేడం క్యూరీ అని అన్నారు. అటువంటి శాస్త్రవేత్తలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకుని సమాజం కోసం పాటుపడే భావి భారత శాస్త్రవేత్తలుగా కావాలని ఆకాంక్షించారు. రామన్, మేరీ క్యూరీ గురించి నిర్వహించిన వకృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మి, వరలక్ష్మి, సులోచన, మహాలక్ష్మి, అరుణ, పుష్పావతి రమ్యశ్రీ, మధులత, ప్రశాంతి, సుకన్య, నక్షత్ర పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి : మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి

సిఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంకల్పంతో గ్రామాలాభివృద్ధికి తోడ్పాటు ఇస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని కొర్లగుంట, వేల్పుచర్ల గ్రామాల్లో రూ.70 లక్షలతో సీసీ అంతర్గత రహదారులు, కొర్లగుంట శివారు సింహాద్రిపురంలో రూ.2.30 లక్షలతో మినీగోకులం అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శుక్రవారం శ్రీకారం చుట్టారు. కోర్లగుంట గ్రామ కో-ఆపరేటివ్ సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. సొసైటీ వద్ద ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, కొర్లకుంట సొసైటీ అధ్యక్షులు పొట్లూరి అనురాధ పండరీనాథ్, ఆవుల బాబూరావు, కొల్లి గంగారం, మెదరమెట్ల సురేంద్ర, పొట్లూరి లక్ష్మీప్రసన్న, మానం ఘంటేశ్వరరావు, గరికముక్కు నాని, తుమ్మల నాగేశ్వరరావు, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే అనర్థాలే



మాట్లాడుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాల్యవివాహాలపై శుక్రవారం డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ అవిద్య, పేదరికంతో బాల్యవివాహాల వైపు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ప్రతి దశలోనూ అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది బాలికలకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యతోనే విజ్ఞానం పెంపొందుతుందని తెలియచెప్పాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీస్, రెవెన్యూ, మెడికల్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. డిఎస్‌పి వివిఎన్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ మహిళా పోలీసుల ద్వారా క్షేత్రస్థాయిలో అనేక పర్యాయాలు సర్వేలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా బాల్యవివాహాలను ప్రోత్సహించే చర్యలు కొనసాగితే కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద, ఐసిడిఎస్ సిడిపిఒ పిల్లి విజయకుమారి మాట్లాడుతూ ఇంటింటికి సర్వే చేస్తూ బాల్యవివాహాలు జరగకుండా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అవగాహన లేకుండా అనాలోచిత చర్యలకు పాల్పడే వారిపై తమదైన శైలిలో నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.

స్క్రీనింగ్‌తో కేన్సర్‌పై విజయం సాధ్యం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పిజె.అమృతం అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం జల వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు.

చింతలపూడి :మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి ఇంట్లో 18 ఏళ్లు నిండినవారికి కేన్సర్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు చింతలపూడి మెడికల్ ఆఫీసర్ గీత అన్నారు. నగర పంచాయతీలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం జాతీయ కేన్సర్ అవగాహనా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్రార్ హుస్సేన్, కంభంపాటి రమేష్, టిడిపి కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు :ప్రాణాంతక కేన్సర్‌ను ముందస్తు పరీక్షల ద్వారా తొలి దశలోనే గుర్తించి నివారణకు చర్యలు తీసుకుంటే దాని అంతం సాధ్యమవుతుందని పూళ్ల, గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శరణ్య, అరుణ జ్యోతి, ప్రదీప్ తెలిపారు. ఆయా ప్రాథమిక కేంద్రాల పరిధిలో ఆరోగ్య విస్తరణ అధికారులు లక్ష్మణరావు, మధుసూదనరావు ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలను చేపట్టారు. పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. మానవహారాలుగా ఏర్పడ్డారు.

ఉంగుటూరు :కేన్సర్ వ్యాధిని అవగాహనతో మొదటి దశలోనే స్క్రీనింగ్ చేయించుకుంటే కీమోథెరపీ వరకు వెళ్లకుండా చికిత్స పొందవచ్చని చేబ్రోలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రావణ్ రెడ్డి, ఆర్.భూషణ్‌రావు అన్నారు. పిహెచ్‌సిలో గ్రామస్తులకు, నారాయపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కేన్సర్‌పై అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాంధే లక్ష్మీసునీత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, ఆరోగ్య ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణ పరిధిలోని కోనేరుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సాయిసుధా మాట్లాడుతూ కేన్సర్‌ను స్క్రీనింగ్‌తో నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి టి కుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం : కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమని డాక్టర్ మురళీధర్ అన్నారు. మండలంలోని వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఆవరణ నుంచి పోలవరం ఏటిగట్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వాసు, ఎంపిహెచ్ఇఒ జారం ప్రసాద్, హెచ్‌విలు టి.పోసమ్మ, వై.గంగాభవాని, హెచ్ఎ జి.చంద్రశేఖర్, ఎఎన్ఎంలు కుమారి, సీతమ్మ, గౌరీలక్ష్మి, సుధారాణి, చంద్రమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు నాగలక్ష్మి, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : కేన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి, అప్రమత్తంగా ఉండాలని గురజ పిహెచ్‌సి డిప్యూటీ సిహెచ్ఒ కె.జోనాథాన్ సూచించారు. ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజిలో గురజ పిహెచ్‌సి ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఒఎస్ఎన్.మూర్తి, పర్వీన్, వేణు, విద్యార్థులు, పిహెచ్‌సి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆరోగ్యకరమైన జీనవశైలి, ముందస్తు పరీక్షల ద్వారా కేన్సర్‌ను నివారించవచ్చని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి జె.జగన్మోహనరావు అన్నారు. ఆగిరిపల్లి పురవీధుల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు స్ఫూర్తి వందేమాతరం గీతం


ముదినేపల్లిలో...

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయంలో డిఎంహెచ్ఒ పిజె అమృతం ఆధ్వర్యంలో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందేమాతరం అనే పదం భారతదేశ దేశభక్తి చరిత్రలో ఒక సువర్ణ పుట అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శోభ, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సావిత్రి, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఆర్‌బిఎస్‌కె జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ముదినేపల్లి:వందేమాతరం గీతం ఉప్పెనలా మారి ఉద్యమమై, నినాదమై, భారతీయుల స్ఫూర్తి మంత్రమై ప్రజ్వరిల్లి ప్రజల గుండెల్లో నిలిచిపోయిందని ఎంపిడిఒ వై.రామకృష్ణ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో వందేమాతరానికి 150 ఏళ్లు స్మారకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. గురజ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో ముక్తకంఠంతో వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ అశోక్, కెవి.సుబ్బారావు, గురజ గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి సుంకర హారిక, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గురజ-2 హెచ్‌ఎం నిమ్మగడ్డ సరోజ, పంచాయతీ సిబ్బంది పలువురు ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో వైఎంహెచ్ఎ హాలులో వందేమాతర గీతం 150 ఏళ్ల ప్రస్థానం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎంహెచ్ఎ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షులు యిరదల ముద్దుకృష్ణ, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతారావు, ఉపాధ్యక్షులు ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు కమిటీ సభ్యులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

భీమడోలు :తహశీల్దార్ బి.రమాదేవి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమాల్ని నిర్వహించారు. భీమడోలు హై స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్‌తో పాటు, భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి, ఎంఇఒ భాస్కర్‌కుమార్, భీమడోలు ఎస్ఐ మదీనా భాషా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భీమడోలు హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మజ పాల్గొన్నారు

నూజివీడు టౌన్ :పట్టణ పరిధిలో సెవెంత్ డే అడ్వెంటిస్ట్ ఆధ్వర్యంలో మెటాస్ సంస్థల అధ్యక్షతన ఎస్‌డిఎ విద్యార్థులు వందేమాతరం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌డిఎ విద్యాసంస్థ నుంచి శ్రీనివాస మహల్ సెంటర్, సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఎస్‌డిఎ విద్యాసంస్థల ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్ మాట్లాడారు.

జంగారెడ్డిగూడెం : తపస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో వందేమాతరం 150 ఏళ్ల వేడుకలను దేశభక్తి ఉత్సాహంతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నేలపై "వందేమాతరం 150" అక్షరాల రూపంలో కూర్చుని దేశప్రేమను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఛైర్మన్ దాకారపు కృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యనారాయణ, మినిమోల్ మేడం, డైరెక్టర్ బుద్దాల సురేష్ పాల్గొన్నారు .

ఉంగుటూరు : చేబ్రోలు గీతాంజలి స్కూల్లో విద్యార్థులు వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. 150 ఆకారంలో ప్రదర్శనతో విద్యార్థులు వారి దేశభక్తిని చాటారు. ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు : మండల పరిధిలోని మద్దాయికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం దారపురెడ్డి భాస్కరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎర్రబాల శివరామకృష్ణ, కె.నవ్య, పి.నాగేంద్రరావు, జె.పద్మ, పి.యువరాజు, అనురాధ, జ్యోతి, జయప్రద, పి.డేనియల్, జాన్సన్, తదితరులు పాల్గొన్నారు

జీలుగుమిల్లి : వందేమాతర గీతం గొప్పతనం నేటి తరం విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలని ఎంఇఒ కె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం ఎంపియుపి పాఠశాలలో బంకించంద్ర ఛటర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఐక్యత చాటేలా వందేమాతర గీతాన్ని ఆలపించారు. ములగలంపల్లి, వంకావారిగూడెం పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, వెంకటేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఫాదర్ జోస్ పాల్ అను నేను దెందులూరు మండలం, సానిగూడెం గ్రామం, మిషనరీస్ ఆఫ్ కంపాషన్ సంస్థకు చెందిన హోలీ స్పిరిట్ మేజర్ సెమినరీ పాత్రుల శిక్షణాధిపతిగా పనిచేయుచున్నాను. మా సంస్థ యొక్క భూమి పత్రాలు ఇటీవల అనగా ది.06-09-2025వ తేదీన సానిగూడెం నుండి దెందులూరు ద్విచక్ర వాహనంతో వస్తూ ఉండగా జారిపడి పోయినవి. దస్తావేజుల నెం.5398/2004, 5396/2004, 5397/2004, 5401/2004, 5400/2004, ఈ పత్రాలు చాలా ముఖ్యమైనవి. కావున ఈ పత్రాలు ఎవరికైనా దొరికినట్లయితే క్రింది చిరునామాకు లేదా ఫోన్ నెంబర్‌లకు తెలియచేయగలరు.

ఫాదర్ జోస్ పాల్, హోలీ స్పిరిట్ మేజర్ సెమినరీ, దెందులూరు మండలం, సానిగూడెం, ఏలూరు జిల్లా. సెల్: 9492054101.

దస్తావేజు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మున్సిపల్ ఏరియా, శివరావుపేట, డోర్‌నెం.2-2-1, కాపురస్తులు బెల్లంకొండ ఫణికుమార్, S/o.బెల్లంకొండ శ్రీరాములు అను నాయొక్క ఒరిజినల్ నెం.4164/1998 గల దస్తావేజును ది.24-10-2025 తేదీన మా ఇంటి వద్ద నుండి భీమవరం జువ్వలపాలెం రోడ్డులో ఉన్న జిరాక్స్ సెంటర్‌కి దస్తావేజులు జిరాక్స్ తీయించుకొను నిమిత్తం ఒక కవరులో పెట్టుకొని నా యొక్క మోటారు సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యలో 4164/1998 నెంబరు గల ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది. ఎంతవెతికినా దొరకలేదు. ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రసుక్కు తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

బెల్లంకొండ ఫణికుమార్, S/o.శ్రీరాములు
డోర్‌నెం.2-2-1, శివరావుపేట, భీమవరం,
ప.గో.జిల్లా. సెల్: 9440110578

'సాయిలక్ష్మి అత్తవారి కుటుంబాన్ని శిక్షించాలి'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఇటీవల హైదరాబాద్ బాలానగర్‌లో సంచలనం కలిగించిన సాయిలక్ష్మి తన కవల పిల్లలను బలవన్మరణానికి గురిచేసి, తాను ఆత్మహత్య చేసుకున్న ఘటనలో అత్తవారి కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలని ఉమెన్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సత్య సుధామ, వ్యవస్థాపక ఛైర్మన్ తోకల రాజేష్ డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలోని అమర్ భవన్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. సాయిలక్ష్మి అత్తవారి కుటుంబసభ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ద్వారకాతిరుమల :మండలంలోని నాలుగు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ద్వారకాతిరుమల వ్యవసాయ అధికారి చెన్నకేశవులు, తహశీల్దార్ సుబ్బారావు తెలిపారు. ఇప్పటికే ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైనమేర గోనెసంచులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

SUMMONS UNDER ORDER V RULE 20 CPC
IN THE COURT OF I ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT TANUKU
O.S.No.455 of 2023

Between:
Kadimi Nageswararao ... Plaintiff
And
Kadimi Vasanth Kumar and Others ... Defendants

To.
Defendant No.2
Kadimi Benerji Kumar, S/o.Ganesh,
R/o.D.No.9-18, Satyanarayana Spinning Mills Road, Venkatarayapuram,
Tanuku Mandal-534 215, Tanuku JCJC.

Where as the Plaintiff has instituted a suit against you for permanent injunction. You are here by summoned to appear in this Court in person or by a pleader duly instructed, and able to answer all material questions relating to the suit, or who shall be accompanied by some person able to answer all such questions, on the 25th Day of November, 2025 at 10 'O' Clock to answer the claim and as the day fixed for your appearance is appointed for the final disposal of the suit, you must be prepared to produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to rely in support of your defense. Take notice that, in default of your appearance on the day before mentioned, the suit be heard and determined in your absence.

Rayaprolu Raja Kiran,
R.A.Begum, Advocates,
Tanuku-534 211,
Cell: 8341437279.
Tanuku
07-11-2025

NOTICE
IN THE COURT OF I ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT TANUKU
I.A.No.1581 of 2023 in O.S.No.455 of 2023

Between:
Kadimi Nageswararao ...Petitioner/Plaintiff
And
Kadimi Vasanth Kumar and Others ...Respondents/Defendants

To.
Respondent No.2/Defendant No.2
Kadimi Benerji Kumar, S/o.Ganesh,
R/o.D.No.9-18, Satyanarayana Spinning Mills Road, Venkatarayapuram,
Tanuku Mandal-534 215, Tanuku JCJC.

Where as the above named Petitioner filed a petition for temporary injunction. You are here by given notice to appear in this Court in person or by a pleader duly instructed, to answer all such questions or raise any objections if you got, on the 25th Day of November, 2025 at 10 'O' Clock to answer the Court. Take notice that, in default of your appearance on the day before mentioned, the petition be heard and determined in your absence.

Rayaprolu Raja Kiran,
R.A.Begum, Advocates,
Tanuku-534 211,
Cell: 8341437279.
Tanuku
07-11-2025

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.5/2021 in O.S.No.180/2006

Between:
1.కర్రి వరలక్ష్మి (డైడ్)
2.సత్తి రజని ప్రసన్న
3.కర్రి వాసంతి
4.కర్రి భారత్ సంతోష్‌రెడ్డి
...పిటీషనర్లు/డిక్రీ హోల్డర్స్
And
1.గొల్లమందల కవలమ్మ
2.గొల్లమందల కుమార రత్నం
3.గొల్లమందల రాజారత్నం
4.చెల్లం రాజ్యలక్ష్మి
5.చింత మేరీ ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డెబ్టార్స్

To.
1.గొల్లమందల కవలమ్మ, భర్త ఏసురత్నం, వయస్సు 75 సం॥లు, స్త్రీ, గృహిణి, పూలపల్లి, పాలకొల్లు మండలం.
2.గొల్లమందల కుమారరత్నం, తండ్రి ఏసురత్నం, వయస్సు 53 సం॥లు, పురుషుడు, వ్యాపారం, పూలపల్లి, పాలకొల్లు మండలం.
3.గొల్లమందల రాజారత్నం, తండ్రి ఏసురత్నం, వయస్సు 38 సం॥లు, పురుషుడు, వ్యాపారం, పూలపల్లి, పాలకొల్లు మండలం.
4.చెల్లం రాజ్యలక్ష్మి, భర్త సూర్యారావు, వయస్సు 45 సం॥లు, స్త్రీ, గృహిణి, కవిటం, పోడూరు మండలం.
5.చింత మేరీ, భర్త సుధాకరరావు, వయస్సు 43 సం॥లు, స్త్రీ, గృహిణి, పూలపల్లి, పాలకొల్లు మండలం.

పై నెంబరు వారంటు అమలు గ్రంథములో జడ్జిమెంట్ డెటర్స్ యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని ది.24-11-2025వ తేదీన ఉ.గం. 10.30 ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో గల పాలకొల్లు మండలం, పూలపల్లి గ్రామ పంచాయతి పరిధిలో గల రి.స.నం. 233/2, L.P.No.596/1985 and revised L.P.No.638/1985 దాఖలా ఫ్లాట్ నెం.13లో గల 311-1-0 చ॥గ॥ స్థలం, దానిలో గల గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు గల డోర్ నెంబర్.1-149 గా గల మేడ భవంతికి హద్దులు :
తూర్పు : చెరుకూరి రామరాజు వగైరాల స్తలం
పడమర: రోడ్డు
దక్షిణం : గొట్టుముక్కల సాయి రామవతి గారి స్తలం.
ఉత్తరం : ప్లాట్ నం.12 ఇంటి స్తలం.
యావత్తు ఈజిమెంటు హక్కులు, విద్యుత్ కనక్షన్‌తో సహా..
డిక్రీ హోల్డర్ విలువ : Rs.4,09,500/-
అమినా విలువ : Rs.5,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
న్యాయవాది, పాలకొల్లు
పశ్చిమ గోదావరి జిల్లా.
పాలకొల్లు
తేది.06-11-2025